క్లుప్తంగా

మాజీ సర్పంచ్ మృతి



నివాళులు అర్పిస్తున్న సునీల్‌కుమార్

బంగారుపాళెం: మండలంలోని కూర్మాయిపల్లె మాజీ సర్పంచ్ దొరస్వామిరెడ్డి గురువారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఇది తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, పార్టీ మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి ప్రవీణ్‌రెడ్డి, నాయకులు అరుణామల్‌రెడ్డి, పాలాక్షిరెడ్డి, అశోక్‌రెడ్డి, సుమత్‌రెడ్డి, మహేంద్రరెడ్డితో పాటు పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కూర్మాయిపల్లె వెళ్లి, దొరస్వామిరెడ్డి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సర్పంచ్‌గా, వైఎస్సార్‌సీపీ నాయకుడిగా ఆయన చేసిన సేవలను స్మరించారు.

1న మార్కెట్ వేలం

ఐరాల: మండలంలోని కాణిపాకం పంచాయతీ కార్యాలయం మార్చి1న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ కుసుమకుమారి తెలిపారు. పంచాయతీకి సంబంధించిన దినసరి సంత, వారపు సంత, షాపింగ్ కాంప్లెక్స్ రూములు, చేపల చెరువుకు వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గలవారు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

శివరాత్రి ఆదాయం రూ 3.94 లక్షలు



బంగారుపాళెం: మొగిలి శివాలయానికి మహాశివరాత్రి ఆదాయం రూ.3,94,693 వచ్చినట్లు చిత్తూరు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో మహాశివరాత్రి రోజు వచ్చిన కానుకలు లెక్కించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీల ద్వారా రూ 1,54,354, సేవా టిక్కెట్లు విక్రయాలతో రూ 2,04,720, అన్నదానానికి విరాళాల రూపేణా రూ 35,616 వచ్చినట్లు వివరించారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు

చిత్తూరు కార్పొరేషన్: జీడీనెల్లూరులో శనివారం సీఎం పర్యటించనున్న సందర్భంగా విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఏర్పాట్లు చేశామని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. ఈఈలు 6, డీఈలు 8 మందికి డ్యూటీలు వేశామన్నారు. అలాగే 5 జనరేటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

స్మార్ట్ మీటర్లపై నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రజలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపుతో వినియోగదారులపై భారం మోపడం తగదన్నారు.

వార్డు సచివాలయం తనిఖీ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని 5వ వార్డు సచివాలయాన్ని కమిషనర్ పి. నరసింహప్రసాద్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. కార్యదర్శుల హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. సమయపాలన పాటించాలని, పన్నుల వసూళ్లలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కార్యదర్శులను ఆదేశించారు. వివిధ పనుల నిమిత్తం వార్డు సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. అనంతరం కమిషనర్ కొంగారెడ్డిపల్లె, పుత్తూరు రోడ్డులో పారిశుధ్య నిర్వహణ, ఇంజినీరింగ్ పనులను పరిశీలించారు. పుత్తూరు రోడ్డులో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన అంచనాలు రూపొందించి సమర్పించాలని ఏఈని ఆదేశించారు. నగరం మొత్తంలో లైటింగ్ వ్యవస్థ ఆటోమెటిక్ సెన్సార్ విధానంలో పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్ల శుభ్రత పనులను తనిఖీ చేశారు. కమిషనర్ వెంట మున్సిపల్ హెల్తాఫీసర్ డాక్టర్ లోకేష్, ఇతర అధికారులు ఉన్నారు.

కరుణించమ్మా.. అంకాళ పరమేశ్వరీ..!



శ్మశానకొల్లలో భక్తజనం



శ్మశానకొల్లలో అభయమిస్తున్న అంకాళ పరమేశ్వరి

శ్మశానకొల్ల జాతరను తలపించింది. జిల్లా వాసులతో పాటు పలురాష్ట్రాల ప్రజలు పోటెత్తారు. అమ్మవారి కటాక్షం కోసం మండుటెండలో గంటల కొద్దీ నిలబడ్డారు. పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. అంకాల పరమేశ్వరిని కొలిచారు. ఆది పరాశక్తి..సకలం నీవేనమ్మా..! చల్లగా కాపాడు తల్లీ..! అంటూ వేడుకున్నారు. పలువురు భక్తులు పూనకంతో ఊగిపోయారు. దక్ష సంహారాన్ని వీక్షించి తరించారు. నగరవీధుల్లో ఊరేగుతూ అంకాళ పరమేశ్వరి అభయమిచ్చారు.

- చిత్తూరులో భక్తిశ్రద్ధలతో శ్మశానకొల్ల
- నీవానది ఒడ్డున్న దక్ష సంహారం
- అంకాళ పరమేశ్వరికి విశేష పూజలు, ఊరేగింపు
- పోటెత్తిన భక్త జనం

చిత్తూరు రూరల్: చిత్తూరులో గురువారం శ్మశానకొల్ల (మయానసేవ)ను అతి వైభవంగా నిర్వహించారు. ప్రతిఏటా మహా శివరాత్రి మరుసటి రోజు చిత్తూరులో శ్మశానకొల్ల ఉత్సవం నిర్వహించిడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ముందుగా గుర్రప్పనాయుడు వీధిలోని అంకాళ పరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తరువాత వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ప్రభపై అమ్మవారిని ఆశీనులు చేసి నీవానది ఒడ్డున ఏర్పాటు చేసిన శ్మశానకొల్ల మైదానానికి తీసుకొచ్చారు. అమ్మవారు శ్మశాన కొల్లలో ప్రదక్షిణలు చేయడంతో దక్ష సంహారం ప్రారంభమైంది.

సంప్రదాయం..దక్ష సంహారం

శ్మశానకొల్ల మైదానంలో మట్టితో భారీ దక్షుడి ప్రతిమను తీర్చిదిద్దారు. ఆ ప్రతిమకు భక్తులు పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. కర్పూర హారతులు వెలిగించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. అంకాళ పరమేశ్వరి మైదానానికి చేరుకోవడంతో అమ్మవారి నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. అమ్మవారు దక్షుడి ప్రతిమ చుట్టూ ప్రదక్షిణలు చేయడంతో దక్ష సంహారం పూర్తయింది. అనంతరం భక్తులు ఆ మట్టి కోసం, అమ్మవారి హారతి, నిమ్మకాయల కోసం ఒక్కసారిగా ఎగబడ్డారు. అలాగే పలువురు మహిళలు పూనకంతో ఊగిపోయారు. మైదానంలో అమ్మవారిని కాసేపు దర్శనార్థం ఉంచారు. తరువాత నగర విహారానికి బయలుదేరారు. భక్తులు అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

కొల్లకు వేలాది జనం

ప్రతి ఏటా అట్టహాసంగా జరిగే ఈ శ్మశాన కొల్ల ఉత్సవాన్ని తిలకించేందుకు తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా భారీ సంఖ్యలో రావడంతో శ్మశానకొల్ల మైదానం మొత్తం జన జాతరను తలపించింది. కాలువ గట్టు, ప్రహరీ గోడలు, పెద్ద పెద్ద భవనాల మీద నుంచి కూడా భక్తులు ఉత్సవాన్ని తిలకించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రతను కల్పించారు. అమ్మవారు ఊరేగింపు ముగిసేంత వరకు పోలీసులు పర్యవేక్షణలో ఉంచారు. అనంతరం నిర్వాహకులు కేఎం కుమార్, అర్చకులు కుమార్ మీడియాతో మాట్లాడారు. అంకాళ పరమేశ్వరి ఆశీస్సులతో బెస్త కులస్తులు ఈ మయాన సేవను 192ఏళ్ల క్రితం నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయనే విశ్వాసంతో పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారని తెలిపారు.



పిండివంటలను నైవేద్యంగా సమర్పిస్తున్న భక్తులు



దక్షుడి ప్రతిమ



మట్టి కోసం ఎగబడుతున్న భక్తులు

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి ప్రవీణ్

తవణంపల్లె: ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపాలని తవణంపల్లె వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ కోరారు. గురువారం మండలంలోని మత్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వ పథకాల ఫలాలు పొందాలంటే తప్పనిసరిగా ఫార్మర్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతులు పంటలకు యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. పంటలకు పురుగులు, తెగుళ్ల ఆశించినా వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పీఎఫ్ మంజూరులో జాప్యం వద్దు

- జెడ్పీ సీఈఓకు ఎస్టీయూ వినతి



సీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగుల పీఎఫ్ తుది మొత్తాల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. గురువారం యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్, జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్ యాదవ్, జెడ్పీలో సీఈఓ రవికుమార్‌నాయుడును కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ చెంది ఏడాది అవుతున్నా వారి ఖాతాల్లో ఉన్న పీఎఫ్ సొమ్మును చెల్లించడానికి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఆడిట్ విభాగంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని, ఖాతాల క్రమబద్ధీకరణలో ఎదురవుతున్న ఇబ్బందుల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని అందరూ డ్రాయింగ్ ఆఫీసర్లతో సమన్వయం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కారుణ్య నియామకాల ప్రక్రియ వేగవంతం చేయాలని, పీఆర్ పరిధిలోని ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఏ శాఖలోనైనా కారుణ్య నియామకం కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఈఓ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, చంద్రన్, మధుబాబు, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

రుణాల ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంక్ అధికారులు



చిత్తూరులో..

గుడిపాల: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 197రామాపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకుకు సంబంధించి 208 దరఖాస్తులు రాగా అందులో 160 మంది, గుడిపాల సప్తగిరి గ్రామీణ బ్యాంకుకు 133 దరఖాస్తులు రాగా అందులో 110మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. గుడిపాలకు సంబంధించి 99 యూనిట్లు మాత్రమే మంజూరయ్యాయి. కొంతమందికి మాత్రమే ఇంటర్వ్యూలు చేశారు. మరికొందరి సంతకాలు తీసుకుని పంపించేశారు. బీఎస్ఆర్‌పేట సప్తగిరి గ్రామీణ బ్యాంకు, నంగమంగళం స్టేట్‌బ్యాంకు సంబంధించి శనివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

చిత్తూరులో..

చిత్తూరు రూరల్(కాణిపాకం): బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం చిత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఏడు బ్యాంకులకు సంబంధించిన అధికారులు హాజరై దరఖాస్తుదారుల పత్రాలను పరిశీలించారు. మొత్తం 68 యూనిట్లకుగాను 316 దరఖాస్తులు రాగా ఇంటర్వ్యూలకు 288 మంది హాజరయ్యారని ఎంపీడీఓ చెప్పారు.

రావణబ్రహ్మ వాహనంపై ఆది దంపతుల కటాక్షం







రావణబ్రహ్మ వాహనంపై ఆదిదంపతులు, బుధవారం రాత్రి వృషభ వాహనంపై పార్వతీ పరమేశ్వరుడు, గురువారం రాత్రి శేషవాహనంపై శివపార్వతులు

బంగారుపాళెం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదవ రోజు గురువారం ఉదయం ఆది దంపతులైన శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి కైలాసగిరి రావణబ్రహ్మ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. తొలుత స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం అలంకార మండపంలో ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి రావణబ్రహ్మ వాహనంపై కొలువుదీర్చారు. స్వామి, అమ్మవారికి భక్తులు కర్పూర హారతులతో మొక్కులు చెల్లించారు. ఈ ఉత్సవానికి బెంగళూరుకు చెందిన సుధారాణి, వెంకటరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి శేషవాహనంపై స్వామి, అమ్మవారు ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమానికి కొండేటివాండ్లవూరుకు చెందిన సుమతి, రంగనాథం నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. అంతకు ముందు రోజు బుధవారం రాత్రి పార్వతీ పరమేశ్వరుడు వృషభ వాహనాన్ని అధిరోహించి భక్త జనులను కనువిందు చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారికి ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం నిర్వహించారు. అనంతరం శివపార్వతులు వృషభ వాహనంపై విహరించారు. ఉత్సవానికి దివంగత సుబ్బరామరాజు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

నేడు గజవాహన సేవ

శుక్రవారం ఉదయం గజవాహనం, రాత్రి కామధేను వాహనంపై స్వామి అమ్మవారు విహరిస్తారని ఈఓ తెలిపారు.

మయానసేవ ఉత్సవం



ఊరేగుతున్న అంకాళ పరమేశ్వరి



మట్టితో తీర్చిదిద్దిన రుద్రుడి ప్రతిమ



పాల బిందెలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రంలో గురువారం మయానసేవ ఉత్సవాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాన్ని పురస్కరించుకుని అంకాళ పరమేశ్వరి ఆలయంలో విశేషపూజలు చేశారు. మహిళలు 101 పాలబిందెలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి, మధ్యాహ్నం ఊరేగించారు. అనంతరం శ్మశానంలో మట్టితో రుద్రుడు ప్రతిమను తీర్చిదిద్దారు. మహిళలు పిండి వంటలను రుద్రుడుకి నైవేద్యంగా సమర్పించారు. అలాగే బొమ్మసముద్రంలోని దుర్గాలమ్మ దేవాలయం, నరహరిపేట చెక్‌పోస్ట్ వద్ద భద్రకాళమ్మ ఆలయంలో అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ఉయ్యాలసేవ నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం



కాళభైరేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం

అశ్వవాహనంపై విహారం

తవణంపల్లె: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తవణంపల్లెలోని కాళభైరేశ్వర ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా శివపార్వతుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు శివపార్వతుల కల్యాణానికి పట్టువస్త్రాలు, సారె, పూజాసామగ్రి, మంగళసూత్రం మొదలైన వాటిని ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. ఆలయంలో కాళభైరేశ్వరుడు, శివలింగం, నందీశ్వరునికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజల అనంతరం ఆలయ మండపంలో శివనారాయణుడు, పార్వతీదేవిని సుందరంగా అలంకరించి పెళ్లిపీటపై ఆశీనులు చేశారు. భక్తజన సందడి నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మ వారికి సారె, చదివింపులు సమర్పించి మొక్కులు చెల్లించారు. అన్నదానం చేశారు.

గురువారం రాత్రి అశ్వ వాహన సేవ నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పట్టువస్త్రాలు, పూజాసామగ్రి ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. ఉత్సవ మూర్తులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజార్చన అనంతరం అశ్వవాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

పట్రపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'

తవణంపల్లె: మండలంలోని పట్రపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు రోగులు, గర్భవతులు, బాలింతలు, బీపీ, మధుమేహం బాధితులను పరీక్షించి మందులు అందజేశారు. గర్భవతులు ఆసుపత్రిలోనే కాన్పులు చేసుకోవడం శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, దిగువ మోదలపల్లెలో వైద్యాధికారి డాక్టర్ కేశవ నారాయణ 104 మొబైల్ క్లినిక్ నిర్వహించి రోగులను పరీక్షించారు.కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం లావణ్య, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఆశా కార్యకర్తలు సౌందర్య, నాగభూషణ, పుష్ప, 104 సిబ్బంది పాల్గొన్నారు.

చుక్కావారిపల్లెలో..

గుడిపాల: మండలంలోని చుక్కావారిపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహణతో గ్రామాల్లో ఇళ్ల వద్దకే వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. అలాగే ప్రతివారం బుధ, శనివారాల్లో ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి గర్భిణుల వివరాలు సేకరించి, వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు.





దిగువ మోదలపల్లె, చుక్కావారిపల్లెలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు కేశవనారాయణ, సంధ్య